క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: గోదావరి నది తీరంలో వేంచేసిన మాండవ్య నారాయణ స్వామివారి గ్రామోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారు జామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు అనంతపద్మనాభాచార్యులు, రవికుమార్ ఆచార్యులు, రఘురామ్ ఆచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గోలి వారివీధి, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం ఆలయానికి చేరింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: పిఠాపురం రోడ్డులో బ్రౌన్‌పేట నుంచి కోదండరామపురం వరకు రోడ్డు మార్జిన్‌లో ఉన్న స్తంభాల మార్పు కారణంగా శుక్ర, శనివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ సామర్లకోట ఈఈ ఏఈఎస్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట–పిఠాపురం రోడ్డులో ఆర్అండ్‌బీ అధికారుల సూచనల మేరకు ఈ స్తంభాలు మారుస్తున్నట్టు చెప్పారు. ఉప్పువారి సత్రానికి వచ్చే 11 కేవీ ఫీడర్, టిడ్కో సముదాయానికి వచ్చే బీఆర్ అంబేడ్కర్ ఫీడర్, పిఠాపురం రోడ్డులోని అగ్రికల్చర్ ఫీడర్, డీఎస్‌పీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సోమ, మంగళవారాలు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రౌన్‌పేట నుంచి టిడ్కో సముదాయం, వ్యవసాయ క్షేత్రం, భీమేశ్వరాలయ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారన్నారు.

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పిఠాపురం డీఈఈ ప్రభాకర్ తెలిపారు. 24 గంటల త్రీఫేజ్ విద్యుత్‌కు కొత్త లైను నిర్మించడంతో పాటు, 33/11 కేవీ చేబ్రోలు సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా 33/11 కేవీ చేబ్రోలు సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, తాటిపర్తి, చిన జగ్గంపేట, చేబ్రోలు, దుర్గాడ, మల్లవరం, అ.విజయనగరంల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఒళ్లు మరిచి..

సామర్లకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక మద్యం షాపులు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. దాంతో మద్యం షాపులతో పాటు, ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించి.. రోడ్లపై చిత్రవిచిత్ర విన్యాసాలు చేస్తున్నారు. మత్తు తలకెక్కడంతో రోడ్లపైనే ఆదమరచి నిద్రపోతున్నారు. ఇలాగే బుధవారం సాయంత్రం స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఓ మందుబాబు శరీరంపై దుస్తులు కూడా చెల్లాచెదురై.. స్పృహ లేకుండా పడిఉండడం స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డు మధ్యలోనే చాలాసేపు అలా నిద్రిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


పనసపాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సామర్లకోట: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలో పనసపాడు, పి.వేమవరం గ్రామాల్లో బుధవారం జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. పనసపాడులో రూ.70 లక్షలతో నిర్మించిన పనసపాడు–అచ్చంపేట రోడ్డును, పి.వేమవరంలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.భైరవమూర్తి సర్పంచ్‌లు చీకట్ల వెంకటేష్, ఎలిశెట్టి నూకరత్నం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిట్ట కొంచెం.. పల్లవి ఘనం..

- పదకొండేళ్ల ప్రాయంలో ఎనలేని ప్రతిభ
- జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, రైఫిల్ షూట్, రన్నింగ్ పోటీల్లో మేటి
- క్రీడా రంగంలో దూసుకుపోతోన్న ఆర్‌జీ పట్నం విద్యార్థిని


సాధన చేస్తున్న బాలిక పల్లవి


రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ పొందుతూ..


సాధించిన బహుమతిని చూపిస్తున్న పల్లవి


స్విమ్మింగ్‌లో తర్ఫీదు పొందుతూ..

పెద్దాపురం: పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏదీ లేదు. ఇది అందరూ చెప్పేదే అయినప్పటికీ.. పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలంటే వయస్సుతో సంబంధం లేదని నిరూపించింది పెద్దాపురం మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామానికి చెందిన పదకొండేళ్ల విద్యార్థిని మన్యం పల్లవి. పట్టు పడితే మాత్రం పతకాలు వచ్చితీరాల్సిందేనని నిరూపించింది. ఒక్క క్రీడా విభాగానికే పరిమితం కాకుండా, నాలుగు అంశాల్లో తనదైన శైలిలో ఉత్తమ ప్రతిభ చూపుతూ ముందుకు దూసుకుపోతోంది. మెట్ట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పల్లవి జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, రైఫిల్ షూట్, రన్నింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ మంచి రికార్డు సృష్టిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలూ సొంతం చేసుకుంది.

కార్పొరేట్‌కు ధీటుగా..

కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో క్రీడా రంగానికి ప్రాధాన్యమిచ్చింది. ఈ నేపథ్యంలోనే కార్పొరేట్ పాఠశాలల కంటే.. తాను చదివిన ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదవాలన్న ఆకాంక్షతో, ఓ మంచి ఆశయం కోసం ప్రభుత్వ పాఠశాలలోనే తల్లిదండ్రులు మన్యం చిన్న, వెంకటలక్ష్మి తమ కుమార్తె పల్లవిని చదివిస్తున్నారు. ఆమెలో క్రీడా ప్రతిభను గుర్తించిన తండ్రి.. చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలనే తపనతో ఓ పూట జిమ్నాస్టిక్, మరో పూట కోచ్‌లు షేక్ రాజ్, నాయుడు వద్ద స్విమ్మింగ్‌లో శిక్షణ ఇప్పించారు. అప్పుడప్పుడూ అథ్లెటిక్స్ కాంపిటీషన్స్, లాంగ్ జంప్, రన్నింగ్ పోటీల్లో పాల్గొంటూ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించింది పల్లవి. జిల్లా క్రీడా స్టేడియంలో వారానికి రెండు సార్లు రైఫిల్ షూటింగ్ శిక్షణ తీసుకుంది.

నాన్నకు ప్రేమతో..

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్న తండ్రి సంకల్పాన్ని పల్లవి చిన్నతనం నుంచే నెరవేర్చుకుంటూ వచ్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2018 నుంచి పిన్న వయస్సులో జిమ్నాస్టిక్, స్కేటింగ్, స్విమ్మింగ్, రన్నింగ్‌లో తర్ఫీదు పొంది.. మంచి ప్రతిభను కనబరుస్తూ ముందుకు దూసుకుపోతోంది.

విజయాల పరంపర

జోనల్ స్థాయిలో 2019లో నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం, 2022లో కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో ప్రథమ స్థానం, గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం, విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం, గతేడాది ఆగస్టు 13, 14 తేదీల్లో మహారాష్ట్ర పూణెలోని శివఛత్రపతి స్పోర్ట్స్ మైదానంలో జరిగిన 11వ జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. అలాగే ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి, పలు బహుమతులు అందుకుంది. జిమ్నాస్టిక్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన పల్లవి అండర్–10కు వయస్సు తక్కువ కావడంతో జాతీయ స్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు అర్హత సాధించలేకపోయింది.

నిత్యం మూడు గంటల సాధన

మా ఊరిలో కబడ్డీ పోటీలు జరుగుతున్నప్పుడు నాన్న పోటీలకు తీసుకువెళ్లేవారు. దీంతో నాకు క్రీడలపై ఆసక్తి పెరిగింది. నాన్న రోజూ కాకినాడ తీసుకెళ్లి స్కేటింగ్‌లో శిక్షణ ఇప్పించేవారు. మూడు గంటల పాటు సాధన చేసేదాన్ని. నాకు నాలుగున్నరేళ్లు వచ్చాక జిమ్నాస్టిక్, స్విమ్మింగ్‌లో శిక్షణ ప్రారంభించాను. ఇప్పుడు నా వయస్సు పదకొండేళ్లు. అంతర్జాతీయ పోటీల్లో రాణించేందుకు నిరంతర సాధన చేస్తున్నా.

– పల్లవి, క్రీడాకారిణి, ఆర్‌బీ పట్నం

ఘనంగా మాదాలమ్మ తీర్థం


గోర్సలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామంలో ఉన్న మాదాలమ్మ తల్లి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు చలిమిడి, వడపప్పును నైవేద్యంగా సమర్పించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. గరగ నృత్యాలతో గ్రామమంతా ఊరేగారు. అమ్మవారిని గజమాల, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. జాతర సందర్భంగా ఆలయ, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. గోర్సతో పాటు, కొమరగిరి, పండూరు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ, సర్పంచ్ రొంగల వీరబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లను, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం పార్టీ పిఠాపురం మున్సిపాలిటీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించింది. యూత్ వింగ్‌కు బోనాసుల రాజా, మహిళా విభాగానికి సోమరౌతు లలిత, రైతు విభాగానికి చవ్వాకుల ఆనంద్, బీసీ సెల్‌కు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, ఎస్సీ సెల్‌కు బత్తిన రాజశేఖర్, ఎస్టీ సెల్‌కు మగ్రి మహేష్, మైనారిటీ సెల్‌కు ఖలీల్‌షా, క్రిష్టియన్ మైనారిటీ సెల్‌కు మాసా రాంబాబు, స్టూడెంట్ వింగ్‌కు కట్టు అజయ్, మున్సిపల్ వింగ్‌కు జోగా రత్నరాజు, ఆర్టీఐ వింగ్‌కు చోడిశెట్టి శ్రీనివాసరావు, వలంటీర్ వింగ్‌కు షేక్ ఖాదా వలీబాబా, వాణిజ్య విభాగానికి కంభంపాటి ఎస్ఆర్ఎన్‌పీవీ ప్రసాద్, వీవర్స్ వింగ్‌కు గిడుతూరి దుర్గారావు, వైఎస్సార్ టీయూసీకి జగడాల రాజు, అంగన్‌వాడీ వింగ్‌కు గునా గీత, సోషల్ మీడియా వింగ్‌కు నల్లమిల్లి పవన్, దివ్యాంగుల విభాగానికి పేపకాయల వీరవెంకటప్రసాద్, పబ్లిసిటీ వింగ్‌కు దూరాసోటును నియమించారు.

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం పార్టీ సామర్లకోట మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. యూత్ వింగ్‌కు ఉగ్గిన గోపి, మహిళా విభాగానికి కోన సత్య, రైతు విభాగానికి మేడిశెట్టి సత్యనారాయణ, బీసీ సెల్‌కు పెంకే అన్నవరం, ఎస్సీ సెల్‌కు ఇంగమళ్ల అచ్చారావు, ఎస్టీ సెల్‌కు మొసిలి అన్నవరం, మైనారిటీ సెల్‌కు మొహమ్మద్ రబ్బానీ, క్రిష్టియన్ మైనారిటీ సెల్‌కు ముమ్మిడివరపు పద్మారావు, స్టూడెంట్ వింగ్‌కు పి.తేజ, పంచాయతీరాజ్ వింగ్‌కు అమజాల నారాయణరావు, ఆర్టీఐ వింగ్‌కు ఇంటి వెంకటరావు, వలంటీర్ వింగ్‌కు యండమూరి దేవి, వాణిజ్య విభాగానికి తోట సత్తిబాబు, వీవర్స్ వింగ్‌కు పంతం సత్యవతి, వైఎస్సార్‌టీయూసీకి పిల్లి పర్వామశెట్టి, అంగన్‌వాడీ వింగ్‌కు దుళ్ల రాణి, కల్చరల్ వింగ్‌కు లక్ష్మణరావు, సోషల్ మీడియా వింగ్‌కు డి.రాజు, దివ్యాంగుల విభాగానికి కంటి మురళీకృష్ణ, పబ్లిసిటీ వింగ్‌కు జక్కా వీరమణికంఠను నియమించారు.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు ఉద్యమం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మధు


మహాసభలో మాట్లాడుతున్న తాటిపాక మధు

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు ఉద్యమం ఆగేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ మండల మహాసభకు పార్టీ నాయకుడు మడగల రమణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి మధు మాట్లాడుతూ, చికాగో వీధుల్లో చిందిన రక్తం సాక్షిగా ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకుందామన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో మోదీ మూడో పర్యాయం అధికారం చేపట్టి, పేద, బడుగు, బలహీన వర్గాల, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. దేశ సంపదను తన మిత్రులైన పెట్టుబడిదార్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేశారన్నారు. జూలై 15, 16 తేదీల్లో సామర్లకోటలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మోదీ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పెదిరెడ్ల సత్యనారాయణ, కేశవరపు అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా సభ్యులు రామకృష్ణ, అర్జునరావు, కిషోర్, లక్ష్మి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు

గురువారం నుంచి పాఠశాలలు తెరుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు ఇవ్వాల్సిన తల్లికి వందనం వేయలేదని మధు ఆరోపించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యోగా పేరుతో ఉద్యోగులను, మహిళలను రోడ్లపైకి తెస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన మందులు లేవని, గ్రామీణ ఆస్పత్రుల్లో మెడికల్ కిట్లు కూడా లేవని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అనుమానితుల సమాచారం ఇవ్వాలి

- సీఐ శ్రీనివాస్
- కొత్త మూలపేటలో కార్డెన్ సెర్చ్


కొత్త మూలపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కొత్తపల్లి: గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తమూలపేటలో బుధవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లల్లో తనిఖీలు చేశారు. రికార్డులు లేని 48 మోటారు సైకిళ్లను, నాలుగు ఆటోలను గుర్తించారు. ఓ ఇంటి సమీపంలో భూమిలో దాచిన 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు సంబంధించిన వివధ చట్టాలపై, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, స్వాధీనం చేసుకున్న వాహనాల రికార్డులు చూపిస్తే, తిరిగి అప్పగిస్తామని చెప్పారు. రికార్డులు లేని వాహనాలు సీజ్ చేస్తామన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. కొత్తపల్లి, పిఠాపురం టౌన్, రూరల్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో వైస్ చాన్సలర్


వైస్ చాన్సలర్ చంద్రశేఖర్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం రాత్రి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ప్రసాదం, ఫొటోను ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు అందజేశారు.

ప్రత్యేక పూజలు

పంచారామ క్షేత్రంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జ్యేష్ఠ పౌర్ణమి కావడంతో స్వామి, అమ్మవారికి, ఉపాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను, ఉపాలయాలను దర్శించుకున్నారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజగోపాలశర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

35 శాతం భక్తుల్లో అసంతృప్తి..!

అన్నవరం: అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి విచ్చేస్తున్న భక్తులు సంతృప్తి చెందేలా సేవలందించడంలో దేవస్థానం వైఫల్యం చెందుతోంది. గత మే నెలలో సత్యదేవుని ఆలయానికి హాజరైన భక్తుల్లో మూడో వంతుకు పైగా దేవస్థానంలో ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రభుత్వ సర్వేలో తేలింది. ఏప్రిల్ 30 నుంచి మే 25 వరకు రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో ప్రభుత్వం సర్వే నిర్వహించింది. అందులో అన్నవరంలోని సత్యదేవుని ఆలయంలో 35 శాతం భక్తులు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు వెల్లడైంది. దర్శనం విషయంలో 32 శాతం మంది, మౌలిక వసతుల కల్పనలో 39 శాతం, స్వామివారి గోధుమ నూక ప్రసాదం నాణ్యతపై 22 శాతం, పారిశుధ్య నిర్వహణలో 36 శాతం భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గత జనవరిలో నిర్వహించిన సర్వేలో చివరిన ఏడో ర్యాంకు రాగా, ఫిబ్రవరిలో రెండో ర్యాంకు వచ్చింది. తాజాగా మే నెలలో నిర్వహించిన సర్వేలో కూడా భక్తుల్లో అసంతృప్తి తగ్గలేదని స్పష్టమైంది. దీనిపై దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు బుధవారం దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది

రత్నగిరి సత్యదేవుని ఆలయం బుధవారం భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తులతో పోటెత్తింది. సుమారు 40 వేలమంది భక్తులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండువేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదువేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదానపథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగ చేశారు.

16న పోలీస్ వాహనాల విడిభాగాల వేలం

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న మోటార్ ట్రాన్స్‌పోర్టు ఆఫీస్‌లో ఈ నెల 16న పోలీస్ వాహనాల విడిభాగాలు వేలం వేస్తామని ఎస్పీ బిందుమాధవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 11 గంటలకు హాజరై వేలంలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాల కోసం మోటార్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌ను 94407 96553 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

యండపల్లిలో మన ఊరు–పనితీరు


యండపల్లిలో కార్యక్రమంలో పాల్గొన్న శ్రామికులు

కొత్తపల్లి: మండలంలోని యండపల్లి గ్రామంలో బుధవారం మన ఊరు–పనితీరు కార్యక్రమాన్ని ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామ ముఖచిత్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధి శ్రామికులతో కలిసి అధికారులు కాలువలో పూడికను తీశారు. ఉపాధి హామీ ఏపీఓ కొండలరావు మాట్లాడుతూ, రోజువారీ వేతనం శ్రామికులకు రూ.307 ఇస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మితాహారంతోనే దీర్ఘాయుష్షు


వృద్ధులకు పాదరక్షలు, విసన కర్రలు పంపిణీ చేస్తున్న వైద్యురాలు వరలక్ష్మి తదితరులు

కాకినాడ రూరల్: మనం తీసుకునే ఆహారం పైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉన్నందున మితాహారం తీసుకోవాలని ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేట ఇందిరా కాలనీలో వరలక్ష్మి సౌజన్యంతో వృద్ధులకు పాదరక్షలు, విసన కర్రలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఎత్తుకు తగ్గ బరువు ఉండాలని అన్నారు. మనం రోజూ ఏం తింటున్నాం అని కాకుండా ఎంత పోషకాలు తీసుకుంటున్నామనేది ముఖ్యమన్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో జీర్ణవ్యవస్థ సామర్థ్యం తగ్గుతుందని, అందువల్ల పోషక విలువలు గల ఆహారాన్ని పరిమితంగా తీసుకోవాలన్నారు. వేపుళ్లు, చిరుతిళ్లు తగదన్నారు. మంచినీళ్లు అధికంగా తాగాలని, రోజు నడక వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. ఏటా వేసవిలో వృద్ధులకు పాదరక్షలు, విసన కర్రలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

చిన్నారుల తల్లులకు అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు, పిల్లలు

జగ్గంపేట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని స్థానిక నెహ్రూ కాలనీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు నిండిన పిల్లలను చేర్పించడంపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటలు, సృజనాత్మకత, చదువు నేర్పిస్తామని చెప్పారు. ఐదేళ్లు వచ్చాక పిల్లలు స్కూళ్లకు వెళ్లేందుకు సంసిద్ధులవుతారని తెలిపారు. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పిస్తామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియామకం

బాలాజీచెరువు (కాకినాడ): తపాలా జీవిత బీమాకు ఏజెంట్లుగా పనిచేయడానికి అర్హత గల యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరిండెంటెంట్ ఆర్.నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. వయస్సు 18 సంవత్సరాలు పైబడి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, దరఖాస్తులు ఈ నెల 20వ తేదీలోగా కాకినాడ పోస్టల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి


డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీఎన్‌జీవో నేతలు

కాకినాడ క్రైం: బదిలీల ప్రక్రియలో భాగంగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన 9 ఏళ్ల మినహాయింపును పరిగణించాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతలు బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహా నాయక్‌ను కలిసారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించి జిల్లా పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ఆఫీస్ బేరర్లకు స్టేషన్ సీనియారిటీ కాకుండా ఆఫీస్ బేరర్ అయినప్పటి నుంచి 9 ఏళ్ల లెక్కించాలని ప్రభుత్వం జీఏడీ సర్కులర్ మెమోలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొందని చెబుతూ సంబంధిత కాపీలు అందజేశారు. సానుకూలంగా స్పందించిన డీఎంహెచ్‌వో ప్రభుత్వ ఆదేశాలమేరకే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. డీఎంహెచ్‌వోను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, సహాయ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, సంఘ నగర నేతలు ఉన్నారు.